క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉత్తరానక్షత్ర పూజలు



ఆలయ సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్పమాలధారులు భజనలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు కస్తూరి కృష్ణారెడ్డి, పార్తిబన్ ఆచారి, గీత, జగదీష్ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, పాల్గొన్నారు.

15న సీపీఎం ప్రజారక్షణ భేరి

నగరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణభేరి బహిరంగ సభకు జిల్లా నుంచి భారీగా కదలి రావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. గురువారం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజారక్షణ భేరి పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పెరుమాళ్, నాయకులు జగదీష్, షణ్ముగం, మురుగేష్, తిరుమల, లక్ష్మాధిపతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు మాదిగవాడ పాఠశాలను ఎంఈఓ శ్రీదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, నాడు–నేడు ద్వారా మంజూరైన తరగతి గది, కిచెన్ షెడ్, టాయిలెట్ పనులను పరిశీలించారు. హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులకు బోధన సంబంధిత సూచనలు ఇచ్చారు.

క్రీడాదుస్తుల వితరణ



క్రీడా దుస్తులను చూపుతున్న విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం తిరుపతికి చెందిన డాలర్స్ సంస్థ అధినేత దివాకర్ రెడ్డి రూ.10 వేలు విలువైన క్రీడా దుస్తులు అందజేసినట్లు హెచ్ఎం మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు జయచంద్ర తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే అన్నారు. ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ దీప మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉంటే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించే ప్రాంతాల్లో సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద రూ.3 కోట్లను మంజూరు చేయడంతో 12 స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్‌రాజు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ అరుణ, వైద్యాధికారి సుమలత, ఎంఈఓ వసుమతి, ఎంపీటీసీలు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు సరికాదు

కార్వేటినగరం: ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై విమర్శలు చేయడం సరికాదని ఏఎంసీ వైస్ చైర్మన్ మంగళపురి గోపి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని ఎదుర్కొనే దమ్ము లేక అదే సామాజిక వర్గానికి చెందిన వారితో టీడీపీ, జనసేన నాయకులు మంత్రిపై బురద చల్లేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అందులో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారి కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు. రెచ్చగొట్టే మాటలు మాని రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లు తెరచి చూడాలని హితవు పలికారు.

సంక్షేమం కావాలంటే జగన్ రావాలి

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి శ్రీకారం
- గ్రామాల్లో సంక్షేమ పథకాల బోర్డు ఏర్పాటు
- ప్రజలతో మమేకం
- నగరి పార్టీ పరిశీలకులు మధుసూదనరెడ్డి



పల్లూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మధుసూదన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

పుత్తూరు: సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ఏపీకి జగన్ కావాలని, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి మోములో చిరునవ్వు అలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదనరెడ్డి అన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీలోని 1వ వార్డు పల్లూరు గ్రామంలో, రూరల్ పరిధిలోని గోపాలకృష్ణాపురంలో అర్బన్, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు శంకర్, గోవిందస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం కాగానే సంక్షేమ సామ్రాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష పార్టీ అసత్యపు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. వీటిని తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. పార్టీ శ్రేణులు ప్రతిరోజూ గ్రామాల్లో సంక్షేమ పథకాలతో బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలని సూచించారు. గ్రామ పెద్దలతో కలిసి గ్రామంలోనే బస చేసి, జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమాల్లో అర్బన్, రూరల్ పార్టీ అధ్యక్షుడు శంకర్, గోవిందస్వామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంఎల్‌ఓ దిలీప్, కౌన్సిలర్లు గుణ, ఏకాంబరం, చిట్టిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచులు మురళి, వసంతమ్మ, మురళీయాదవ్, మునిరాజు, నాయకులు మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఈశ్వరయ్య యాదవ్, చక్రి, రాంబత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





గోపాలకృష్ణాపురంలో గ్రామస్తులతో చర్చిస్తున్న పార్టీ శ్రేణులు, వడమాలపేట బట్టీకండ్రిగలో..

వడమాలపేటలో..

వడమాలపేట మండలం బట్టీకండ్రిగ గ్రామంలో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. బట్టీకండ్రిగ పంచాయతీ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఏర్పాటు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. వీటిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేషరాజు, యాదవేంద్రరెడ్డి, సుధీర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, నాగభూషణంరాజు, ఉమాపతి, రమేష్, సుదర్శనవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలయ్యపల్లెలో..

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె–1 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ ఆలయంలో గురువారం ఆలయ ఈఓ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అల్లియల్లమ్మ తల్లి ఆలయంలో హుండీ ద్వారా రూ.1,08,839 ఆదాయం వచ్చిందన్నారు. ఈ సొమ్మును దేవదాయ, ధర్మదాయ శాఖ అకౌంటులో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్ర రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, అర్చకులు ఆనంద్ అయ్యంగార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



పెనుమూరు: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : పేదలకు సంక్షేమ ఫలాలు లబ్ధి చేకూరాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం పెనుమూరు సచివాలయం వద్ద ఎంపీపీ హేమలతారెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీకీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సచివాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ పతాకం, సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ జెడ్పీటీసీ దొరస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, డీడీఓ ప్రభుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని సురేంద్రనగరంలో సర్పంచ్‌లు పెరియస్వామిరెడ్డి, తులసి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పతాకాన్ని ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం సురేంద్రనగరం గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్ కోసం..

వెదురుకుప్పం: భావితరాల భవిష్యత్ కోసం జగనే కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.37 కోట్లు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, ఎంపీటీసీ గుణశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, నాయకులు బండి గోవర్ధన్‌రెడ్డి, రోశిరెడ్డి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రం జీడీనెల్లూరు గ్రామ సచివాలయంలో మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ అనిత గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జీడీనెల్లూరు పంచాయతీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం రూ.70 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకట రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: మాంబేడులో

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం సచివాలయంలో గురువారం మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ నరసింహరాజు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జనంలోకి 'జగన్ సైన్యం'





నగరి: మాట్లాడుతున్న ఆర్‌కే సెల్వమణి, బుగ్గఅగ్రహారంలో జెండా ఎగురవేస్తున్న భరత్, రామ్‌ప్రసాద్‌రెడ్డి

- అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్' ప్రారంభం
- వరుస కార్యక్రమలతో వైఎస్సార్‌సీపీలో జోష్
- వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో నూతన కార్యక్రమం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీన్ని జనంలోకి తీసుకెళ్లి విజయవంతం చేసేందుకు 'జగన్' సైన్యం సిద్ధమైంది. ఇప్పటికే కార్యక్రమం విశిష్టతను పార్టీ నాయకులకు వివరిస్తూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం నార్త్ పరిధిలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి ఆధ్వర్యంలో, నగరి మండలంలోని బుగ్గ అగ్రహారంలో, విజయపురం సచివాలయ పరిధిలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది.

చేసిన మేలు ప్రజలకు చెప్పేందుకే..

ప్రజలకు చేసిన మేలు చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని సీఎం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి అన్నారు. మేలు చేసుంటేనే ఓటెయ్యండని ధైర్యంగా చెప్పే సీఎం దేశంలోనే ఎవరూ లేరని, కేవలం ఒక్క జగనన్నకే సాధ్యమన్నారు. ఏకాంబరకుప్పం సచివాలయ పరిధిలో సంక్షేమం ద్వారా 24 పథకాలలో రూ. 10.65 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. 500 కుటుంబాల్లో 350 కుటుంబాలకు సంక్షేమం అందిందన్నారు. రూ.1.62 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఇంతటి మేలు ఏ ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. ఈ మేలు ఇలా కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలన్నారు. సీఎం జగన్ చేసిన మేలును, గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటా వివరించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు బీడీభాస్కర్, భూపాలన్, బాబు, పురుషోత్తం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చాం..

బుగ్గ అగ్రహారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో రూ.14 కోట్ల మేర సంక్షేమం, రూ.1.84 కోట్లను వెచ్చించడం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బుగ్గ అగ్రహారానికి ఉన్న నీటి సమస్యను భగీరథ ప్రయత్నంతో తీర్చడం జరిగిందన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. ఇంతటి మంచి చేసే ప్రభుత్వం మళ్లీ రావాలన్న దృఢ సంకల్పం ప్రజలకు ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సచివాలయాల్లో బోర్డుల ద్వారా ప్రదర్శించారు. అనంతరం పార్టీ జెండాను జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ భరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, ఎంపీడీఓ లీలామాధవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీలు, సర్పంచులు కోఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



పెనుమూరు: వైస్ ఎంపీపీ అరుణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మృతుల కుటుంబాలకు అన్నివిధాలా నేను అండగా ఉంటానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పెనుమూరు మండలం వైస్ ఎంపీపీ–2(రాజాఇండ్లు ఎంపీటీసీ) దూది అరుణ(35) గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె కర్మక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైస్ ఎంపీపీ అరుణ అకాల మృతి పార్టీకి తీరని లోటన్నారు. అదేవిధంగా పెనుమూరు ఎంపీటీసీ మామ కర్మక్రియల సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కార్వేటినగరం మండలంలో సురేంద్రనగరంలో మృతి చెందిన జయమ్మ(75), గంగాధరం(80) కుటుంబాలను కూడా ఆయన పరామర్శించి ఓదార్చారు. మంత్రి వెంట మండల కన్వీనర్లు శేఖర్‌రాజు, విజయకుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, పద్మనాభశెట్టి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణయాదవ్, జేసీఎస్ కన్వీనర్ పురంధర్ ఉన్నారు.

టీటీడీ కట్టడాలపై విమర్శలు తగవు

పురాతన నమూనాలతో టీటీడీ ప్రాచీన కట్టడాలను ఆధునీకరిస్తున్నామని, అందులో ఎలాంటి మార్పులు లేవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజాఇండ్లు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందల ఏళ్ల కిందట తిరుమలలో అప్పటి విజయనగర రాజులు కట్టించిన పార్వేట మండపం ధ్వంసం కావడంతో వాటిని టీటీడీ అధికారులు ఆధునీకరిస్తుంటే బీజేపీ నాయకులు విమర్శలు గుప్పించడం మంచిది కాదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఆలయ నిర్మాణాలను సెంటిమెంట్‌గా తీసుకుని రాజకీయం చేయడం తగదన్నారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

మెనూ ప్రకారం గోరుముద్ద అందించండి



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓలు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. గురువారం బలిజకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తోందన్నారు. ప్రతిరోజు ఉడికిన గుడ్డు, చిక్కీ అందిస్తున్నట్లు చెప్పారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలతో భోజనం తయారు చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజేశ్వరి, మునిరాజ్ పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న జడ్జి

పుత్తూరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక సీనియర్ న్యాయవాది మురగేశన్‌రెడ్డి సూచించారు. గురువారం న్యాయ సేవా దినోత్సవాన్ని స్థానిక రాస్ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలకు అనేక సమస్యలు ఎదురవుతూ ఉంటాయని, వాటన్నింటినీ అధిగమించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి సమాజంలో మహిళల పట్ల హింసాత్మక సంఘటనలు జరుగుతుండడం దురదృష్టకరమన్నారు. మహిళలకు భారత రాజ్యాంగంలోని 15 ఆర్టికల్ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. పోక్సో చట్టం ద్వారా మహిళలను లైంగిక హింస నుంచి, డీవీసీ యాక్ట్ గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తోందని వివరించారు. మహిళలు పనిచేస్తే సంస్థల్లో లైంగిక దాడులు జరగకుండా కమిటీల ఏర్పాటు, లింగ నిర్ధారణ పరీక్షలు, స్త్రీశిశు భ్రూణ హత్య చట్టాల పట్ల మహిళలు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. విద్యార్థినులు గుడ్, బ్యాడ్ టచ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ మోహన్, కోఆర్డినేటర్ హరిబాబు, పీడీ రవి, మహిళలు పాల్గొన్నారు.